ACCION FRATERNA
ecology centre
sustainable . human . nature

# ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటర్, అనంతపురం.

ఈ మాసపు సమాచారం సెప్టెంబర్, 2009

FOR PRIVATE CIRCULATION ONLY

## మనకు కరువులు కొత్తకాదు. ఎన్నో కరువులను జయిస్తూ వస్తున్నాం. మరోసారి కరువును జయిద్దాం ! గుండె నిబ్బరంతో నిలబడదాం !!

రైతు మిత్రులారా !

ఈ సారి ఖరీఫ్ పంట విత్తనం వేయకనే వెళ్ళిపోయింది. మే మాసంలోనే మంచి వర్షాలు రావడంతో ఈసారి మంచి వర్షాలు వస్తాయనే అనుకున్నాం. ఒక్క పదును వస్తే విత్తనం వేయడానికి జిల్లాలోని రైతాంగమంతా సిద్ధంగా ఉన్నప్పటికీ, ఆగస్ట్ 20 వరకూ నిరీక్షించినప్పటికీ ఒక్క వర్షం కూడా రాలేదు. మనకే కాదు, ఈసారి దేశమంతా వర్షాభావ పరిస్థితుల్లోనే ఉండింది. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే వర్షాలుపడితే, చాలా భాగం విత్తనమే పడలేదు. ఈ దశలో మన జిల్లాలో కొందరు రైతులు విత్తనాల్ని అమ్ముకున్నారు. విత్తనం పెట్టుకోవడానికి ఊజీవస్తుందని భయం. టి.యం.వి.2 వేరుశెనగ విత్తనం స్థానంలో మంచి రకం విత్తనాలైన కె6, అనంత జ్యోతి విత్తన రకాలను ఇతర ప్రాంతాలనుంచి రైతులు మరియు ఎకాలజి సంస్థ ఎంతో కష్టపడి సేకరించినారు. రైతులు వర్షం వస్తే విత్తనం వెంటనే వేయడానికి అనువుగా సిద్ధం చేసుకున్నారు. మనందరి ప్రయత్నాలన్నీ వృధా అయినట్లు అనిపిస్తుంది. ముఖ్యంగా కె6, అనంతజ్యోతి విత్తనాలు కూడా పొగొట్టుకోవలసి రావడం విచారకరం.

### కరువులు మనకు కొత్తకాదు

మన జిల్లాకు ఎప్పుడూ వర్షం సమస్యే. దేశంలోనే రెండవ అతి తక్కువ వర్షపాతంగల జిల్లా. పదేళ్ళలో రెండు, మూడు పంటలు మాత్రమే పండుతాయి. మిగత సంవత్సరాలు పంటలు అరకొరగా పండడమో లేదా పూర్తిగా పంటలు ఎత్తిపోవడమో జరుగుతుంది. సాధారణంగా విత్తనం వేసిన తర్వాత కరువుతో పంటలు పోవడం మనకు అనుభవంలో ఉన్నాయి. విత్తనం వేయకనే ఖరీఫ్ పంటకాలం వెళ్ళిపోవడం అరుదైన విషయం. పంటలు పూర్తిగా వేయలేక పోవడాన్ని గురించి బాధపడ్తామా? విత్తనం వేయనీయకుండా పంట పెట్టుబడులను, విత్తనాన్ని కొంతమేరకు మిగులు జరగడం గూర్చి సంతోషపడదామా ? విషాదంలో తక్కువ విషాదమా లేక ఎక్కువ విషాదమా అని ఆలోచించలేం.

చరిత్రలో అతిశయోక్తులు రాసినట్లు ఈ ప్రాంతంలో రతనాలు రాసులుపోసి అమ్మలేదు. వర్షాభావంతో చిట్టడవులతో వ్యవసాయయోగ్యం కాని ఈ జిల్లాలో వ్యవసాయం చేయడానికి, భూములను సాగు చేయడానికి పాలకులు రైతులను ఇతర ప్రాంతాలనుండి రైతులను రప్పించారు. వారికి శిస్తురాయితీలను ఇచ్చారు. కరువులొచ్చి పంటలు పోతే వారికి ప్రోత్సాహకాలిచ్చారు. ఈ ప్రాంతాన్ని మానవ నివాస యోగ్యం చేయడానికి, వ్యవసాయం అభివృద్ధి చెందడానికి అనేక చెరువులు, కుంటలు, కాలువలను నిర్మించారు. ఆనాడు మన పూర్వీక రైతుల శ్రమశక్తి ఫలితంగానే ఈ ప్రాంతం నివాస యోగ్యంగా అభివృద్ధి చెందింది. చెమటలు ధారపోసి వ్యవసాయాన్ని బతికించారు. ప్రకృతి ప్రతికూల పరిస్థితులను అధిగమించారు. పడేది తక్కువ వర్షాపాతమైనా చిన్ననీటి వనరుల ద్వారా సంరక్షించారు. చెరువుల రక్షణ ఒక సామాజిక ధర్మకార్యంగా భావించారు. మానవ ప్రత్నాలు ఎన్నిచేసినప్పటికీ, కరువులు ఈ ప్రాంతాన్ని వీడలేదు. "రాయలసీమలో పిలిస్తే కరువు, అనంతపురం జిల్లాలో పిలవకనే కరువు వస్తుందని" సామెత. ఈ రకంగా నిత్యకరువులు మన జీవితాల్లో ఒక భాగంగా మారిపోయినాయి! కదిరి ఖాద్రీ నరసింహస్వామి ఆలయంలో శిలా శాసనము ఆనాటి కరువులకు సాక్షీభూతంగా నేటికి నిలిచి ఉంది. ఆకలితో చనిపోయిన మానవ కలేబరాలు ఎక్కడ చూచినా పడి ఉన్నాయని ఆ శాసనంలో వుంది. ఆనాడు తీవ్రంగా బాధించిన డొక్కల కరువు ఉదంతమిది. తినడానికి తిండిలేక కొండల నుండి గేదెరాకును తెచ్చి ఉడికించి ఎర్రని మట్టిని జల్లెడపట్టి కలుపుకు తిన్న విషయాలు ఈనాటికి గ్రామాల్లోని వృద్ధులు చెబుతారు. అటువంటి తీవ్ర కరువుల్లో మనం చివరగా చూచినది 1964-65సం॥లో వచ్చిన కరువు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1954 ప్రాంతంలో ఈ ప్రాంతం కరువు పరిస్థితులను స్వయంగా చూడడానికి వచ్చిన మొదటి ప్రధాని పండిత జవహర్ లాల్‌నెహ్రూగారు గార్లదిన్నె ప్రాంతంలో జరుగుతున్న కరువు పనుల్లోకి వచ్చిన ప్రజల దుర్భర దారిద్ర్యాన్ని చూసి కళ్ళనీళ్ళు పెట్టుకున్నారని చెబుతారు.

### ఆనాటికి, ఈనాటికి పరిస్థితులలో వచ్చిన మార్పులు :

ఆనాడు లేని సాంకేతిక విజ్ఞానం ఈనాడు వుంది. ఇతర ప్రాంతాలలో సాగునీరు సౌకర్యాలు పెరిగినాయి. పంటల దిగుబడి కూడా పెరిగింది. రవాణా సౌకర్యాలు కూడా పెరిగినాయి. పెరగందల్లా మన జిల్లా వ్యవసాయ పరిస్థితి మాత్రమే. మన జిల్లాలో సాగు చేస్తున్న రైతంగానికి అత్యంత ముఖ్యమైన సాగునీటి సదుపాయం 8 శాతం కూడాలేదు. పూర్తిగా వర్షాధారం మీదనే వ్యవసాయం ఆధారపడి ఉంది. మనకొచ్చిన స్వాతంత్ర్యానికి శష్టిపూర్తి వయసువచ్చినా కనీసంగా ఉండాల్సిన 30 శాతం సాగునీరు కూడా అందుబాటులో లేకపోవడం దురదృష్టకరం. వ్యవసాయమంటే, నీటి పారుదల వ్యవసాయమే అన్న భావనతో మెట్ట వ్యవసాయాన్ని కరువు పీడిత ప్రాంతాలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం ఫలితంగానే వర్షాధార రైతు సమస్యలు ఇంత వరకూ తీరకుండా ఉన్నాయి. గడ్డు పరిస్థితులలో కూడా మన రైతులు తట్టుకొని, వారు బ్రతుకుతూ వ్యవసాయాన్ని బ్రతికిస్తూ వస్తున్నారు. మన రైతులకు మించిన ధైర్యవంతులు లేరు. ప్రకృతి వనరులు పుష్కలంగా ఉండి కూడా, ఇప్పటికీ వ్యవసాయం అభివృద్ధి చెందని ప్రాంతాలను మన రాష్ట్రంలోనే గమనించినపుడు, మన జిల్లా రైతుల ప్రతిభ ఏమిటో అర్థం అవుతుంది. ప్రతికూల పరిస్థితులలో సైతం వ్యవసాయాన్ని చేస్తున్న అనుభవాలతో పాటు, కరువులను ఎదుర్కొనే గుండెనిబ్బరం కలిగి ఉండడం మనపూర్వీకులు మనకు వారసత్వంగా అప్పగించిన వారసత్వాలు.

గతంలో ఉన్న పరిస్థితులతో ప్రస్తుత పరిస్థితులను పోల్చలేం. గతంలో కుటుంభాలకు కేవలం తిండి మాత్రమే అవసరంగా ఉండేది. ఈ రోజు రైతులకు తిండితోపాటు, కుటుంబ అవసరాలు, పిల్లల విద్య, వైద్య ఖర్చులు, దుస్తులు, వినియోగ వస్తువులు, ప్రయాణ ఖర్చులు ఎక్కువగా ఉన్నాయి. మార్కెటింగ్ వ్యవస్థలో రైతు అనుకూల పరిస్థితులు ఇప్పటికీ ఏర్పడకపోవడం వల్ల, రైతు "అమ్మబోతే అడవి, అమ్మకొనబోతే కొరివి" అన్న సామెత నిజమవుతూనే ఉంది. రైతులు పండించిన పంటలు మార్కెట్టులో అమ్మబోయినప్పుడు వ్యాపార వర్గాలు కృత్రిమ మాంద్యం సృష్టిస్తారు. ఆ తరువాత ధాన్యాలను గోడౌన్లలో దాచిపెట్టి కృత్రిమ కొరతను సృష్టించి అధికరేట్లతో అమ్ముతున్నారు. అందుకే రైతులు పంటలను వెంటనే →

**చిట్కా : చిన్నపిల్లలకు వచ్చే జలుబుకు తమలపాకునకు ఆముదం రాసి వేడిసెగకు పెట్టి రొమ్ముపైన లేదా తలపైన పట్టులా వేస్తుంటే జలుబు తగ్గుతుంది.**

"భూమాత అపారమైన తన అడవుల్ని, వన్య ప్రాణుల్ని, నదుల్ని, సముద్రాల్ని కాపాడుకుంటున్నంత వరకూ మానవ సంతతి వర్ధిల్లుతూనే ఉంటుంది" ఉపనిషత్తులు

అమ్మకుండా వడ్లను బియ్యంగా మార్చి అమ్మడం, వేరుశెనగను పప్పుగానో, నూనెగానో మార్చి అమ్మడం లాంటి విలువ జోడింపు కార్యక్రమాలకు పూనుకోవాలి. ఇది ఒక్కరి వల్ల సాధ్యం కాదుకానీ, గ్రామైక్య సంఘాల ద్వారా, సస్యమిత్ర గ్రూపుల ద్వారా సాధ్యమవుతాయి. ఇవన్నీ నిదానంగా పట్టుదలతో మార్చుకోవలసిన పద్ధతులు.

## కరువు పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవాలి :

గతంలో కరువులు వచ్చినప్పుడు తిండిలేక ప్రజలు కటకటలాడి పోయేవారు. పెద్ద రైతులు పోసుకున్న గాదెల్లో తప్ప తిండి గింజలు ఉండేవి కాదు. పనులు అసలు ఉండేవి కాదు. ఈ రోజు ఆ పరిస్థితి లేదు. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ రైతుల సాధకబాధలు అర్థం చేసుకోగల ప్రభుత్వాలు ఉన్నాయి. రైతుల కోసం గొంతు విప్పే పార్టీలు, పౌర సంస్థలు ఉన్నాయి. జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంత ప్రజలకు గొప్ప ఆదరువుగా వుంది. ప్రజలు ఆకలితో అలమటించకుండా, పస్తులుండకుండా జీవించడానికి ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుంది. కరువు పరిస్థితులలో ఆహారధాన్యాల కొరత తీర్చేందుకు ప్రభుత్వ గోదాముల్లో ఉన్న తిండి గింజలను మార్కెట్లోకి విడుదల చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతునే ఉంది. పంటలు నష్టపోయినప్పుడు రైతులను ఆదుకోవడానికి ఇన్సూరెన్సు పథకం ఉన్నది. ఇవన్నీ అనేక సంవత్సరాల నుంచీ ప్రజలు, మేధావులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు కృషిచేసి సాధించుకున్న పథకాలు. మెట్టరైతు పంట పెట్టినా, పెట్టకపోయినా ప్రతి సంవత్సరం ఎకరానికి రెండు మూడు వేల ప్రోత్సాహకం అందించే పథకం కోసం మనమందరం డిమాండు చేసి సాధించుకోవాలి.

అన్ని జన్మలకంటే మానవ జన్మ గొప్పదంటారు. పశుపక్ష్యాదులకు లేని విజ్ఞాన సౌలభ్యం మనకు ఉంది. నిన్నటి గురించిన అనుభవాలు జ్ఞాపకాలు ఉంటాయి. రేపటి పరిస్థితులలు గురించి ఆలోచనలు ఉంటాయి. అదే మనుషులకున్న సౌలభ్యం. ప్రకృతి వికటించిన తీవ్ర పరిస్థితులలో సైతం పశువులు పక్షులు తమ సంతతిని బతికించు కోవడానికి ఆరాటపడుతాయి. వాటిని కాపాడుకుంటాయి. అటువంటిది మనుషులుగా మనం రేపటి గురించి ఆలోచించలేమా ? గతంలో క్షణికోద్రేకంతో జీవితం చాలించిన వారి కుటుంబాలు ఎన్నిపాట్లు పడ్డాయో మనకందరికి తెలుసు. పిరికితనం మన లక్షణం కాదు. ధైర్యంతో పరిస్థితులు ఎదుర్కోవాలి. ఇనుము కొలిమిలో రాటుదేలినట్లుగా కష్టాలలో, కరువులలో మనం మరింత రాటుదేలాలి. పిల్లల భవిష్యత్తు, జీవితం కొరకు శ్రమించాలి. ఎన్నో కష్టాలలో, ఆర్థిక పరిస్థితుల్లో సైతం మన జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల యువత పోటీ పరీక్షలలో నెగ్గి మంచి ప్రభుత్వోద్యోగాలు సంపాదించు కుంటున్నారు. మన పిల్లల ధైర్యానికి పట్టుదలకు ఇది చాలదా ? అందుకే మనల్ని నమ్ముకుని జీవితం పంచుకున్న వారిని గురించి ఆలోచించాలి. మన చుట్టుపట్ల వారిని గురించి ఆలోచించాలి. మన చుట్టూ ఉన్న సమాజం గురించి ఆలోచించాలి. ధైర్యం కోల్పోయిన వారికి స్వాంతన వచనాలతో ధైర్యాన్నివ్వాలి. ఈనాడు రైతు ఒంటరిగా లేడు. ఎంతోమంది మేధావులు, శాస్త్రవేత్తలు, మొత్తం సమాజం రైతు గురించి ఆలోచిస్తున్నారు. దేశంలో ఆర్థిక మాంద్యం వచ్చినా సమాజం బెదరలేదు. రైతు పంటలు పెట్టలేకపోయే పరిస్థితిని గురించి మొత్తం సమాజమే ఆందోళన చెందుతూ ఉంది. రైతు పడకేస్తే, వ్యవసాయం పడకేస్తే మొత్తం సమాజమే తలకిందులవుతుంది.

## పరిస్థితి పూర్తిగా నిరాశాజనకంగా లేదు.

వర్షాలు రాక కరువంటేనే మనందరినీ మొట్టమొదటగా ఆందోళన కలిగించిన సమస్య పశువుల మేత, తాగునీరు. ఆహార పంటలు కూడా పండిస్తూ ఉంటే పశువులకు మేత ఉండలేని విషయాన్ని మనం గుర్తు పెట్టుకోవాలి. ఆహార ధాన్యాల కొరత వస్తే, ఇతర ప్రాంతాలనుంచి ధాన్యాలు తరలించవచ్చు పెద్ద కష్టంకాదు. కానీ పశువుల మేత, తాగునీరు తరలించడం ఎంతో వ్యయప్రయాసలతో కూడిన పని. అదృష్టవశాత్తూ ఆగస్ట్ మూడవ వారం నుంచి జిల్లాలో వర్షాలు పడుతున్నాయి. పశువుల మేతకు, తాగునీటి సమస్య ఒకమేరకు తీరినట్లే. ప్రకృతిని గత అనుభవాలను మిళితం చేసుకుంటూ సాగేదే వ్యవసాయం. నీటి వసతి ఉన్నవారు అంతో ఇంతో భూమిలో పశువుల మేత పెంచడం అలవాటుగా చేసుకోవాలి. దీంతోపాటే పాడి పశువులను పెంచుకోవాలి. దీనివలన పశువులకు మేతతోపాటు కుటుంబానికి ఆదాయం కూడా వస్తుంది. ఈ విషయాన్ని అనేక సందర్భాలతో మనం చెప్పుకుంటున్నాం.

ఎకాలజీ సెంటరు పనిచేస్తున్న 230 గ్రామాలలో 127 విత్తన బ్యాంకులు పనిచేస్తున్నాయి. మరో అయిదు విత్తన బ్యాంకులు సుస్థిర వ్యవసాయ కేంద్రం హైద్రాబాదు వారి సహకారంతో ఏర్పాటు చేశాము. ఈ విత్తన బ్యాంకులు ఉన్న గ్రామాలలోనే కాకుండా ఒక్కో విత్తన బ్యాంకు గ్రామం చుట్టుపట్ల ఉన్న 2-3 గ్రామాల అవసరాలు తీరుస్తాయి. ఖరీఫ్ ఆలస్యమైనా, విత్తనం వేయడానికి అవసరమైన జొన్నలు, కొర్రలు, సద్దలు, ఉలవలను విత్తన బ్యాంకులు సేకరించి రైతులకు అందుబాటులో ఉంచడం జరుగుతోంది. ప్రభుత్వం కూడా కంటింజెన్సీ ప్లాను కింద రాయితీతో జొన్న, ఉతవ విత్తనాలను సెప్టంబరు మొదటి వారం నుంచి రైతులకు సరఫరా చేస్తున్నారు. ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలి. విత్తనం విత్తిన తర్వాత నవంబరు మాసంలో ఒక వర్షం వచ్చినా పశువుల మేతతో పాటు కొంత పంట కూడా రావచ్చు. జొన్నలు, కొర్రలు, ఉలవలు సెప్టెంబరు మాసమంతా వేయవచ్చును. రైతులకు కావలసిన విత్తనాల కోసం విత్తన బ్యాంకు కమిటి సభ్యులు, ఎకాలజీ సెంటరు సిబ్బంది సహాయపడుతారు.

## రైతు సస్యమిత్ర సమాఖ్యల పాత్ర :

మన సంస్థ పనిచేస్తున్న గ్రామాలన్నింటిలోనూ గ్రామ స్థాయిలో సస్యమిత్ర గ్రూపులు, గ్రామ సస్యమిత్ర సమాఖ్యలు, మండల స్థాయిలో మండల సస్యమిత్ర సమాఖ్యలు ఏర్పాటు చేసిన సంగతి మీకందరికి తెలిసిన విషయమే. సస్యమిత్ర గ్రూపులు ఇటువంటి సమయాల్లో చురుకైన పాత్ర వహించాల్సి ఉంది. కేవలం వ్యవసాయంలో వచ్చే సమస్యలే కాదు. రైతు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా సస్యమిత్ర గ్రూపు సభ్యులు పట్టించుకోవాలి. ఎవరైతే మానసికంగా ఆందోళనకు గురి అవుతుంటే ఆ రైతుకు ధైర్యం చెప్పాలి. కలిసి అందరం కరువులను, ఆర్థిక సమస్యలను అధిగమించగలమని తెలియచెప్పాలి. బ్యాంకు అధికారులు ఋణాలు ఇవ్వకుండా రైతులను ఏవో కుంటి సాకులతో ఇబ్బంది పెడ్తున్నట్లు తెలుస్తున్నది. గ్రామ సస్యమిత్ర గ్రూపు లీడర్లు ఇటువంటి బ్యాంకు అధికారులతో మాట్లాడాలి. అవసరమైతే మండల సస్యమిత్ర సమాఖ్య వారి సహాయం తీసుకోవాలి. ప్రభుత్వం ప్రకటించిన పథకాలు ప్రజలకు సక్రమంగా చేరడంలో అనేక సమస్యలున్నవని మనకు తెలుసు. ఈ ప్రభుత్వ పథకాలు పొందడం మన హక్కు. వీటన్నింటిని మనం ఉపయోగపెట్టుకోవాలి. కంటింజెన్సీ పథకం కింద ఈ ఒకటవ తేదీ నుండీ ప్రభుత్వం రబీ పంటల కోసం 50 శాతం రాయితీ మీద విత్తనాలను సరఫరా చేస్తున్నది. ఈ విత్తనాలు రైతులందరికి చేరేలాగున సస్యమిత్ర సమాఖ్యలు చొరవ తీసుకోవాలి.

## ఈ సందర్భంగా తక్కువ పెట్టుబడి వ్యవసాయ పద్ధతి గురించి చర్చించుకోవడం అవసరం :

ఇలాంటి పరిస్థితులు మనకేమి కొత్తకాదని అందరికీ తెలిసిన విషయమే. పంటలు పోయినప్పుడు రైతు ఎక్కువగా నష్టపోయేది పంటకు పెట్టిన పెట్టుబడులతోనే. అవే రైతులను అప్పులపాలు చేస్తున్నాయి. ఈ పరిస్థితులలో మార్పు తీసుకురావాలనే మనం సుస్థిర వ్యవసాయ పద్ధతుల గురించి మాట్లాడుకుంటున్నాం. పెట్టుబడులు తక్కువగా వ్యవసాయం ఉండాలని చెప్పుకుంటున్నాం. సుస్థిర వ్యవసాయ పద్ధతులను ఆచరిస్తున్నవారు, ఇలాంటి కరువు పరిస్థితులకు బెదరడం లేదు. వ్యవసాయంలో అధిక పెట్టుబడులే వ్యవసాయ సమస్యలకు ప్రధాన కారణంగా ఉంటున్నాయి. సుస్థిర వ్యవసాయమంటే కేవలం సేంద్రీయ ఎరువులు వాడడమే కాదు. ఉన్నటువంటి భూమిలో ఆహార, వాణిజ్య పంటలతోనూ, రెండుమూడు రకాల పళ్ల చెట్లు పెంచుకోవడం వల్ల సుస్థిర ఆదాయం లభిస్తుంది. కాబట్టి రైతు సోదరులు ఇలాంటి పరిస్థితులను గుణపాఠంగా తీసుకొని సుస్థిర వ్యవసాయం వైపు మళ్ళడమే పరిష్కారం. ఈ కరువు పరిస్థితులను అధిగమించగల మనో ధైర్యం, అధిగమించాలనే పట్టుదల కలగాలని ఆశిస్తూ...

అభినందనలతో...

**డా॥ వై.వి. మల్లారెడ్డి**

**డైరెక్టరు : ఎకాలజి సెంటరు.**

(4వ పేజీ తరువాయి)

2. గ్రూపు ఉద్దేశ్యములను నెరవేర్చుటకు నిర్ణయించిన ప్రకారం సమావేశములను ఏర్పాటు చేసుకొని తగిన నిర్ణయాలు తీసుకోవడం మరియు వాటిని అమలు చేయడం చేయవలయును.
3. గ్రామంలో సభ్యులందరికి అనువైన ప్రదేశంలో సమావేశములు ఏర్పాటు చేయవలయును.
4. సభ్యులందరూ అంటే కుటుంబానికి ఇద్దర నమోదు కాబడిన పురుషులు మరియు స్త్రీలు సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలి.
5. మహిళా సభ్యులకు సమాన స్థాయిని కల్పించి, వారి అభిప్రాయాలకు విలువనిచ్చి, వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి.
6. గ్రూపు నిర్ణయాలను గౌరవించి పాటించవలయును.

**8. విధులు, బాధ్యతలు - కార్యక్రమాలు :**

1. గ్రూపులోని రైతులందరూ సుస్థిర సేంద్రీయ వ్యవసాయ విధానముపైన నమ్మకం కల్గి, ఆ పద్ధతులను పాటించుతూ, ఇతరులను ప్రోత్సహించుట.
2. గ్రూపులో “ఒకరి కోసం అందరు – అందరి కోసం ఒకరు” అనే సహకార సిద్ధాంతాన్ని పాటించవలయును గ్రూపులోని సభ్య కుటుంబాలు వ్యవసాయ, వ్యవసాయేతర విషయాలలో ‘పరస్పర సహకారం’ అభివృద్ధి చేసుకోవాలి. ఉదా॥ విత్తనాలను ఇచ్చుపుచ్చు కోవడం, పనికి బదులు పోవడం, రెండు మూడు కుటుంబాలు కలిసి వ్యవసాయ పనులు చేసుకోవడం, ఎద్దులు, బండ్లు, వ్యవసాయ పనిముట్లు బదులు ఇచ్చుకోవడం, అప్పులు ఇచ్చుకోవడం మొదలగునవి. పరస్పర సహకారం ద్వారా వ్యవసాయ ఖర్చులు తగ్గి, ఇతర బాధలు తగ్గి, ‘ఒంటరి’ అనే భావన లేకుండా, ప్రతి ఒక్కరూ తన గ్రూపు మొత్తం తన వెంట వుంది అనే భావన, నమ్మకం కల్గివుండవలయును.
3. సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించి రైతులలో విస్తృతంగా వ్యాప్తి చేయడానికి నెల వారి ప్రణాళిక, సీజను ప్రణాళికను సిబ్బంది సహకారముతో తయారు చేసుకొని, ఆ ప్రణాళికలను ఎప్పటికప్పుడు ఒక పద్ధతి ప్రకారం అమలు చేస్తూ, పర్యవేక్షణ చేయవలయును.
4. పొలంబడి కార్యక్రమంలో ఎంపికయిన సభ్యులు తప్పనిసరిగా పాల్గొనవలెను. పొలంబడి ఒక నిరంతర వ్యవసాయ పాఠశాలగా రూపొందించుకొనవలెయును. పొలంబడి జరిగిన రోజు సాయంత్రం గ్రూపు సభ్యులు సమావేశం ఏర్పాటు చేసుకొని పొలంబడిలో గమనించిన విషయాలపై చర్చించి అవసరమయిన నిర్ణయాలు తీసుకొని అమలు చేయాలి.
5. వివిధ స్థాయిలలో (గ్రామ, క్లస్టర్లు, ఏరియా) నిర్వహించే శిక్షణలు, సమావేశాలకు తప్పకుండ హాజరు కావాలి
6. గ్రూపుకు సంబంధించిన రికార్డులను పారదర్శకంగా నిర్వహించు కోవాలి.
7. ప్రభుత్వ / ప్రభుత్వేతర సంస్థల నుండి గ్రూపు సభ్యులకు ప్రయోజనం చేకూరే విధంగా వనరులు సమీకరించవలదీరిజిరి
8. సుస్థిర సేంద్రీయ వ్యవసాయ సానుకూల ప్రభుత్వ విధానాల సాధన కోసం (1) ప్రభుత్వం రైతులకు అందించవలసిన ప్రోత్సాహకాలు (2) సుస్థిర సేంద్రీయ వ్యవసాయానికి ప్రభుత్వం కల్పించవలసిన మౌలిక సదుపాయాలు (3) సుస్థిర వ్యవసాయ సానుకూల ప్రభుత్వ విధి విధానాలు (4) సుస్థిర సేంద్రీయ వ్యవసాయోత్పత్తుల గిట్టుబాటు ధర, మార్కెటింగ్ సౌకర్యాల కొరకు ప్రభుత్వము పై తగిన విధంగా ఒత్తిడి తెచ్చి సాధించుట.
9. గ్రామ, మండల, జిల్లా స్థాయి సస్యమిత్ర సమాఖ్యలకు సహకారం అందిస్తూ, వారి సహకారమును పొందుట.
10. సుస్థిర సేంద్రీయ వ్యవసాయ పద్ధతికి ఆధునిక వ్యవసాయ పద్ధతికి గల తేడాలను ఇతర రైతులకు తెలియజేయుట
11. సుస్థిర సేంద్రీయ వ్యవసాయ ప్రదర్శనా క్షేత్రాలు ఏర్పాటుచేసి, గ్రామంలోని రైతులందరికి సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను ప్రదర్శన ద్వారా నేర్పించవలయును.
12. సుస్థిర వ్యవసాయంలో నూతన ప్రయోగాలు చేపట్టవలయును
13. గ్రామంలో విత్తన బ్యాంకుల ఏర్పాటు చేసుకొని, రైతులకు సకాలంలో నాణ్యత గల విత్తనాలను తక్కువ ధరలకే అందించవలయును
14. పండించిన పంటలకు అదనపు విలువలు కల్పించి, సామూహిక మార్కెటింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేసికొని, రైతులకు అదనపు ఆదాయం వచ్చేటట్లు కృషి చేయవలయును.

## పొలంలోనే జీవామృతం తయారు చేసుకొని, వాడుకొను విధానం

పళ్ళ తోటలుగలవారు పొలంలోనే జీవామృతాన్ని తయారు చేసుకునే పద్ధతుల్ని పరిచయం చేస్తున్నాము. పళ్ళ చెట్లకు రసాయనిక ఎరువులు వాడకుండా జీవామృతం వాడడం వలన నేలలో సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది చెట్లకు కావలసిన పోషక పదార్థాలు సమతుల్యంగా అందుతాయి. పళ్ళ చెట్లు నుంచి ఆరోగ్యంగా పెరుగుతాయి. భూమిలో కూడా రకరకాల సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది, నేల స్వంతంగా తనంతకు తానుగా పోషక పదార్థాలు తయారు చేసుకునే స్థాయికి చేరుకుంటుంది. మొక్కల వేరు బాగా అభివృద్ధి చెందుతాయి. బయటి నుంచి ఎలాంటి ఎరువులు వేయాల్సిన అవసరం రాకుండా ఉంటుంది. నేలలో జీవామృతం అవసరం ఉన్నంత మేరకు ఈ ప్రక్రియను కొనసాగించాలి.

జీవామృతం ఎల్లవేళల మనకు అందుబాటులో ఉండుటకుగాను డ్రమ్ములు ఉపయోగించి జీవామృతం ఏ విధంగా తయారు చేసుకోవాలో ఈ క్రింద వివరించబడింది.

100 లీటర్ల పరిమాణం గల డ్రమ్మును 3/4 వంతు భూమిలో పాతిపెట్టుకోవాలి. దానిని గోనె సంచితో కానీ, దోమతెర గుడ్డతో కానీ మూతిని మూసి వుంచుకోవాలి లేనియడల దానిలో ఈగలు వెళ్ళి గుడ్లు పెట్టును. గుడ్లనుండి పురుగులు బయటికి వచ్చి అసహ్యముగా ఉండును. పాములు కూడా డ్రమ్ములో పడే అవకాశము ఉన్నది.




100 లీ. డ్రమ్ము

# సస్యమిత్ర గ్రూపులు

## 1. సస్యమిత్ర గ్రూపులు స్థాపించుటకు కారణం.

సస్యమిత్ర గ్రూపులను స్థాపించడానికి కారణం, సుస్థిర సేంద్రీయ వ్యవసాయంతో భూమాతను సుసంపన్నం చేసి ప్రతి రైతుకు గౌరవప్రద జీవనంతోపాటు సమాజానికి ఆహార సమృద్ధి సాధించడం.

## 2. సస్యమిత్ర గ్రూపు ఉద్దేశ్యాలు.

1. సుస్థిర సేంద్రీయ వ్యవసాయ (తక్కువ ఖర్చు) పద్ధతులను రైతులందరి చేత ఆచరణ చేయించి, వారికి ఆదాయ భద్రత మరియు ఆహార భద్రతలను సాధించుట.
2. నాణ్యమైన విత్తనం, సేంద్రీయ ఎరువులు, సేంద్రీయ రోగ నివారణ పద్ధతులు తక్కువ ఖర్చుతో ప్రతి రైతు సాధ్యమైనంత వరకు తానే తయారు చేసుకొని వ్యవసాయాన్ని రైతు ఆధీనములో వుంటునట్లు సాధించుట. అంటే వ్యవసాయాన్ని మరియు రైతును విత్తన కంపెనీలు, ఎరువులు మరియు మందులు కంపెనీల బారి నుండి తప్పించి, రైతు ఆధీనములోకి తెచ్చుట.
3. భూమాతను విష రసాయనాల నుండి విముక్తిచేసి, జీవవైవిధ్యంతో, సహజ సంపదతో సుసంపన్నం చేయుట.
4. వ్యవసాయ ఉత్పాదనను ఉత్పత్తులను అధికం చేసి, వాటి విలువ పెంపు మార్కెటింగ్ సౌకర్యాలు చేపట్టుట
5. సుస్థిర సేంద్రీయ వ్యవసాయ వ్యాప్తి కోసం అనుకూలమైన ప్రభుత్వ విధానాలను తీసుకొని రావడానికి ప్రభుత్వముపై తగిన విధంగా ఒత్తిడి తెచ్చి, సుస్థిర వ్యవసాయానికి సానుకూల విధానాలను సాధించుట.

## 3. సస్యమిత్ర గ్రూపులో చేరడానికి సభ్యుల అర్హతలు

1. గ్రామంలో నివాసముంటూ, వ్యవసాయ వృత్తిగల రైతులు / రైతు మహిళలై యుండవలెను.
2. సుస్థిర సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై నమ్మకముండి వీలైన పద్ధతులను పాటిస్తూ, మిగిలిన వాటిని పాటించుటకు సంసిద్ధత కలిగియుండవలెను.
3. సస్యమిత్ర గ్రూపులో చేరుటకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, సుస్థిర సేంద్రీయ వ్యవసాయాన్ని వ్యాప్తి చేయడం ఒక దైవ కార్యంగా భావించి, చురుకుగా పనిచేయుటకు ఇష్టంగా వుండవలయును
4. గ్రూపు నిర్ణయాల ప్రకారం సభ్యత్వ రుసుం చెల్లిస్తూ, గ్రూపు నిర్ణయించిన కట్టుబాట్లను క్రమ శిక్షణతో పాటిస్తూ, గ్రూపు ఉద్దేశ్యాలు నెరవేర్చుటకు వ్యక్తిగతంగానూ, సమిష్టిగానూ చొరవతో, నిష్ఠగా పనిచేయుటకు, గ్రూపు తనకిచ్చిన బాధ్యతలను నిజాయితీగా, చురుకుగా నిర్వర్తించుటకు సిద్ధంగా వుండవలయును.

## 4. సభ్యుల ఎంపిక విధానము.

1. మొదట సుస్థిర సేంద్రీయ వ్యవసాయంపై గ్రామ స్థాయి సదస్సులు నిర్వహించి పాల్గొన్న రైతుల నుండి అర్హులైన ఉత్సాహవంతులైన మరియు ఆసక్తి కనబరచిన రైతు / రైతు మహిళలను సోషియో టెక్నికల్ ఆర్గనైజరు నమోదు చేయుదురు.
2. ఒక్కొక్క కుటుంబము నుండి ఇద్దరు సభ్యులు - వారిలో కనీసం ఒకరు మహిళా సభ్యులుగా నమోదు చేయుదురు. అదే విధంగా ఏ కుటుంబములోనైనా పురుషులు లేని యెడల, ఇద్దరు మహిళలనే సభ్యులుగా నమోదు చేయుదురు. అదే విధంగా ఏ కుటుంబములోనైనా మహిళలు లేని యెడల, ఇద్దరు పురుషులు సభ్యులుగా నమోదు చేయుదురు. తరువాత వీరి నుండి సభ్యత్వ రుసుము వసూలు చేసి, సస్యమిత్ర గ్రూపులో సభ్యులుగా నమోదు చేయుదురు.

## 5. సస్యమిత్ర గ్రూపు నిర్మాణము :

1. ఒకే ప్రాంతంలో భూములు గల లేదా స్నేహబాంధవ్యాలు గల 25 మంది రైతులు ఒక సస్యమిత్ర గ్రూపుగా ఏర్పడి, ఒక కుటుంబము నుండి ఇద్దరు సభ్యులుగా వుంటారు. ఇద్దరిలో ఒకరు మహిళ అయివుండాలి.
2. పై పద్ధతి ద్వారా గ్రూపులో స్త్రీ పురుషుల ప్రాతినిధ్యం సమానంగా వుంటుంది.
3. ప్రతి గ్రూపుకు ఒక స్త్రీ, ఒక పురుషుడు కన్వీనర్, కో-కన్వీనర్‌లుగా గ్రూపు సభ్యులు ఏకాభిప్రాయముతో ఎంపిక చేసుకుంటారు. వీరు రెండు సంవత్సరములు కన్వీనర్, కో-కన్వీనర్‌గా కొనసాగుతారు. రెండు సంవత్సరముల తరువాత, వారి పని తీరును సమీక్షించి, సమంజసమనుకుంటే, తిరిగి వారినే నియమించుకొన వచ్చును, లేదా మార్చుకొనవచ్చును. ఏ కారణము చేతనైనా రెండు సంవత్సరములకు ముందే కన్వీనర్ లేదా కో-కన్వీనర్ పదవులు ఖాళీ అయినయెడల, కొత్తవారిని ఏకాభిప్రాయంతో ఎన్నుకొనవలయును.
4. ఆ గ్రూపునకు తమకిష్టమైన పేరును వారే నిర్ణయించి తీర్మానము చేయవలయును.

## 6. కన్వీనర్లుగా, కో-కన్వీనర్లుగా ఎన్నుకొనబడుటకు అర్హతలు :

1. సుస్థిర సేంద్రీయ వ్యవసాయము పై పూర్తిగా నమ్మకముండి సాధ్యమైనన్ని సేంద్రీయ పద్ధతులు పాటించుచుండవలయును
2. సస్యమిత్ర గ్రూపు కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనుటకు ఇష్టమై వుండి, గ్రూపు కార్యక్రమాలకు సమయాన్ని వెచ్చించగలిగి వుండవలయును. మండలము, జిల్లా స్థాయిలో జరుగు కార్యక్రమాలకు, ట్రైనింగ్‌లకు, మీటింగ్‌లకు హాజరు అయ్యేదానికి సిద్ధంగా వుండవలయును.
3. సభ్యులతో గౌరవంగా వుంటూ, అందరితోనూ మంచి సంబంధాలు కలిగి, స్నేహ పూర్వకంగా, కలుపుగోలుతనం కలిగి ఉండవలయును. విషయాలను చక్కగా వివరించే నైపుణ్యం ఉండాలి.

## 7. గ్రూపు నియమ నిబంధనలు కట్టుబాట్లు :

1. ప్రతి కుటుంబము సంవత్సరానికి రూ. 30/- లేదా నిర్ణయించిన ప్రకారం సభ్యత్వ రుసుము చెల్లించాలి. (మిగతా 3వ పేజీలో)

ప్రచురణ: డైరెక్టరు - ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.
☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990, E-mail : actionf@sancharnet.in
actionf_atp@dataone.in